క్లుప్తంగా

భారీ వర్షాలకు కుప్పకూలిన చెట్టు



తహసీల్దారు కార్యాలయం వద్ద కూలిన చెట్టు

పిఠాపురం: మండలంలోని గొల్లప్రోలులో గురువారం భారీ వర్షాలకు ఒక చెట్టు కుప్పకూలిపోయింది. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా కూలి విద్యుత్ తీగలపై పడిపోవడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో పోలీసులు హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని ఎవరినీ అటు వైపు వెళ్లకుండా ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎటువంటి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీపై కేసు

కొత్తపల్లి: ఉప్పాడ మెయిన్‌రోడ్డులో ఉన్న సాయికృష్ణ కిరాణా దుకాణంలో ఈ నెల 19 తేదీన జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. దుకాణంలో ఉన్న రూ.12,500 అపహరణకు గురవడంతో దుకాణం యజమాని సఖినాల కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు



ముంపు బారిన పడిన కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ

పిఠాపురం: వర్షాల నేపథ్యంలో వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని సుద్దగడ్డ ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు మూడు రోజుల్లో వరద పెరిగే అవకాశాలు ఉండడంతో సుద్దగడ్డ ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వారికి తాగు నీరు, వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడెక్కడ ముంపుకు గురయ్యే అవకాశాలున్నాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వరద పెరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించామన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో సుద్దగడ్డ ముంపు బారిన పడిన జగనన్న కాలనీ రహదారిపై రాకపోకలు నిషేధించి వారికి ప్రత్యామ్నాయ మార్గం కల్పించాలని గొల్లప్రోలు తహసీల్దారు ఆర్‌వీ వెంకటేశ్వరరావుకు సూచించామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ ప్రభుకుమార్ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

పిఠాపురం: మండలంలోని నర్సింగపురం నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను స్థానిక నాయకులు గురువారం పాఠశాలలో దుశ్శాలువాలతో సత్కరించారు. బదిలీపై వెళ్లిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సీహెచ్ మంగాదేవి, టి.శైలజ, రాయుడు శ్రీనివాస్, పీఎస్ మాధురిలకు సత్కార కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కె.అర్జునుడు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారంటూ వారిని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓలేటి పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వులవల భూషణం, ఉపసర్పంచ్ మాతా బాబులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని రామచంద్రమిషన్ ఆడిటోరియంలో ఆర్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్, మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మిషన్ కో–ఆర్డినేటర్ కె.మూర్తి తెలిపారు. యోగా అసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు హాజరు కావాలని కోరారు.

క్షతగాత్రులకు చికిత్స

కాకినాడ క్రైం: చొల్లంగిలో ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన ముగ్గురు క్షతగాత్రులను గురువారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఇదే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కాకినాడ ఏటిమొగ ఆంజనేయ స్వామి గుడి వీధికి చెందిన మల్లాడి సతీష్ (35) మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

కౌలుకు ప్రోత్సాహం

- సాగులో పెరుగుతున్న కౌలు రైతులు
- వారికి ఊతమిస్తున్న సీసీఆర్‌సీ పత్రాలు
- రుణాల బాధ్యతను తీసుకున్న వ్యవసాయాధికారులు
- అదే క్రమంలో వ్యవసాయం తగ్గించుకుంటున్న భూ యజమానులు



సామర్లకోట: భూస్వాములు స్వయంగా వ్యవసాయం చేయడం తగ్గించడంతో కౌలు రైతుల సంఖ్య పెరిగింది. దీనిలో భాగంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 22,250 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా మండల పరిధిలో 13 వేల మంది రైతులు ఉన్నారు. ఈ భూములకు సంబంధించి 4800 నుంచి ఐదు వేల వరకు కౌలు రైతులు ఉన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత రైతులకు రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 అందజేస్తున్నారు. ఈ మొత్తం రైతులకు పెట్టుబడిగా ఉపయోగపడుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు రూ.13,500 రైతు భరోసా వర్తిస్తుంది. మిగిలిన కౌలు రైతు సాగు కార్డులు కలిగిన వారికి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తున్నారు. ఈ మేరకు ప్రతి ఏడాది వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కౌలురైతులను గుర్తించి వారికి కౌలు రైతు కార్డులు అంజేస్తున్నారు. గతంలో భూమి కలిగిన రైతులు కౌలు కార్డులపై అభ్యంతరాలు తెలిపేవారు. అయితే కౌలు రైతు కార్డుల కాల పరిమితి 11 నెలలకు కుదించి రైతులకు ఇబ్బందులు లేకుండా చేశారు. దాంతో ప్రతి కౌలు రైతుకు సాగు కార్డులు అందుతున్నాయి.

సాగు కార్డులతో రైతులకు భరోసా..



కౌలు రైతులకు సాగు కార్డులు అందజేయడంతో ఆ కార్డుల ఆధారంగా బ్యాంకులు సులభంగా రుణాలు అందజేస్తున్నాయి. దీనికి తోడు పంట నష్టం జరిగిన సమయంలో పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ నేరుగా కౌలు రైతుల బ్యాంకు ఖాతాలోనే జమ అవుతుంది. గతంలో రైతుల బ్యాంకు ఖాతాలో జమ కావడంతో వారి దయా దాక్షిణ్యంపై కౌలు రైతులు ఆధారపడవలసి ఉండేది. రైతులు వ్యవసాయం చేయడానికి సుముఖత చూపడం లేదు.

– మలకల వరాలబాబు, కౌలు రైతు, పీబీ దేవం

కౌలు రైతులకు పంట రుణాలు



మండల పరిధిలో 4,250 మంది కౌలు రైతులను గుర్తించడం జరిగింది. ఇప్పటి వరకు 3,800 కౌలు రైతు సాగు కార్డులు అందజేశాం. కార్డులు పొందిన ప్రతి రైతుకూ ఆయా బ్యాంకులలో రుణాలు ఇచ్చేలా చేస్తున్నాం. ఈ మేరకు వచ్చే నెల నుంచి ఈ క్రాప్ బుకింగ్ జరుగుతోంది. ఈ క్రాప్ బుకింగ్‌లో ప్రతి రైతు తమ తమ పేర్లను నమోదు చేయించుకోవాలి.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

సీసీఆర్‌సీ ద్వారా బ్యాంకు రుణాలు

కౌలు రైతు సాగు కార్డు ఉన్న ప్రతి రైతుకు ఆయా బ్యాంకుల అధికారులు పంట రుణాలను అందజేస్తున్నారు. దాంతో కౌలు రైతులకు పంటల సాగుపై భరోసా ఏర్పడింది. ఈ మేరకు ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి రైతుల సమక్షంలో కౌలు రైతు కార్డులు జారీ చేస్తున్నారు. గతంలో భూమి యజమానిపై ఆధారపడి పంట సాగు చేయడం జరిగేది.



కౌలు రైతులకు సాగు కార్డులు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

మణిపూర్ ఘటనలపై యూటీఎఫ్ నిరసన



రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సామర్లకోట: మణిపూర్‌లో జరుగుతున్న మారణ కాండకు నిరసనగా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారం, రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసకు కేంద్ర పాలకులు బాధ్యత వహించాలన్నారు. మణిపూర్‌లో దోషులైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. నాగేశ్వరరావు, కాశీ విశ్వనాథం, గోవిందు, శైలజ, వీరమణి, ప్రవీణ, బాలశైలజ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

కొత్తపల్లి: ఒక యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పాడ గ్రామానికి చెందిన ఒక యువతి ఈనెల 25వ తేదీన వాళ్ల నాన్నమ్మతో బయటకు వెళ్ళి వస్తానని చెప్పి తిరిగిరాకపోవడంతో తన తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వసతి గృహానికి ఫ్యాన్ల బహూకరణ



ఫ్యాన్లు అందజేస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: పిఠాపురం బీసీ వసతి గృహానికి పిఠాపురానికి చెందిన శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా గురువారం ఐదు ఫ్యాన్లు బహూకరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్లను హాస్టల్ వార్డెన్ కల్పనకు అందజేశారు. కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, మెహబూబ్ బాషా, హుస్సేన్‌షా, అజీజ్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వర్షాల నేపథ్యంలో పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడ చూసినా చిత్తడిగా కనిపిస్తుంది. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రధానంగా ఇలాంటి సమయాల్లో దోమలు విజృంభించి వ్యాధులకు కారణమవుతుంటాయి. దోమలు నిల్వ నీటిలో, వర్షపు నీటి నిల్వల్లో పెరుగుతాయి. అందుకే ప్రజలు ముందుజాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే

ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరం, ఈడిస్ దోమలు కుట్టడం వల్ల డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయి. ఎనాఫిలస్, ఈడిస్ రెండు రకాల దోమలు నిల్వ ఉన్న మంచి నీటిలో, వర్షపు నీటిలో పెరుగుతాయి. నీటి నిల్వ చేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, కొట్టి పారేసిన కొబ్బరి బొండాలు, కొబ్బరి చిప్పలు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, ఫ్లవర్ వాజ్‌లు, రుబ్బు రోళ్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్సులు, వాటర్ హెడ్ ట్యాంకుల్లో దోమ లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. నిల్వ ఉన్న నీటిపై దోమలు వాలి గుడ్లు పెడతాయి. ఒక దోమ 200 వరకు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లన్నీ వారం నుంచి 10 రోజుల్లో దోమలుగా వృద్ధి చెందుతాయి. అందుకే దోమల పెరుగుదలను నియంత్రించాలంటే వారానికి ఒక రోజు తప్పనిసరిగా డ్రైడే పాటించాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులు సూచిస్తున్నారు. అంతేకాదు ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వకు కారణమయ్యే వస్తువులను తొలగించుకోవాలంటున్నారు. దీనివల్ల దోమల వృద్ధికి ఆస్కారముండదని చెబుతున్నారు.

ముందు జాగ్రత్తలతో మేలు



వర్షాకాలంలో కలుషిత నీరు, దోమల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. అందుకే ముందు జాగ్రత్తగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి. నీటి నిల్వలను పారబోసి మళ్లీ ఫ్రెష్‌గా నీటిని పట్టుకోవాలి. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలి. అవసరమైతే సమీప పీహెచ్‌సీను ఆశ్రయించాలి.

– డాక్టర్ మౌనిక, వైద్యాధికారి, కొత్తపల్లి పీహెచ్‌సీ

సంసిద్ధతలో యంత్రాంగం

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు మొదలైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో రోగ లక్షణాలున్న వారిని గుర్తించి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇప్పటికే సర్వే చేపట్టారు. ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలున్న వారందరి రక్తాన్ని సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల శుభ్రత, పారిశుధ్య పనులపై పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించాలి

- ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ
- ఖరీఫ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ

పిఠాపురం: ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులకు సాగు హక్కు ధ్రువపత్రాలతో పాటు ఖరీఫ్ రుణాలు అందించడానికి చర్యలు తీసుకున్నట్టు ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కౌలు సాగుహక్కు ధ్రువపత్రాలు, ఖరీఫ్ రుణాలు తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులతో పాటు కౌలు రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా కల్పించడమే ధ్యేయంగా వ్యవసాయ శాఖ సిబ్బంది పని చేయాలని సూచించారు. డివిజన్‌లో సుమారు 34 వేల కౌలు సాగుహక్కుదారు ధ్రువ పత్రాలకు ఇప్పటి వరకు 23 వేల వరకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు చొరవ చూపేలా వ్యవసాయ శాఖాధికారులు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రగతి చూపాలన్నారు. గొల్లప్రోలు మండలంలో 3,407 మంది కౌలు రైతులకు 2474 మందికి సాగుహక్కు ధ్రువ పత్రాలు అందించామన్నారు. మిగిలిన ధ్రువపత్రాలు నిర్దిష్ట సమయంలో అందజేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఎక్కడా ఏ ఒక్క రైతు రుణాలు అందలేదనే మాట రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఇవ్వవలసిన కౌలు సాగుహక్కుదారు ధ్రువ పత్రాలు వెంటనే అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పి.స్వాతి, ఎంపీడీఓ శర్మ, మండల వ్యవసాయ శాఖాధికారులు, గ్రామ వ్యవసాయశాఖాధికారులు, ఆర్‌ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందని గడపే లేదు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అందని గడప ఒక్కటీ లేదని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణంలోని 29వ వార్డులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చారని చెప్పారు.

గత ప్రభుత్వం మాదిరిగా జన్మభూమి కమిటీల పేరుతో అవినీతికి తావులేకుండా వలంటీర్లను ఏర్పాటుచేశామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అభివృద్ధికి రూ.20 లక్షలను కేటాయిస్తున్నామని చెప్పారు. తమది గత ప్రభుత్వం మాదిరిగా మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ముఖ్యమంత్రి చేసి చూపిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ అవగాహన లేమితో మాట్లాడుతూ అభివృద్ధి వారి హయాంలోనే జరిగిందంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గతంలో ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పినా ఇంకా తెలివి రాలేదని ఛలోక్తి విసిరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సురక్షతో సత్వర పరిష్కారం

- ఎల్లో మీడియా వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలి
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న సురక్షతో సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఎండపల్లిలో ఉన్న సచివాలయం–1లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ శీలం పెద్ద అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పెండెం దొరబాబు దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండపల్లిలో రెండు సచివాలయాలకు సంబంధించి 1030 ధ్రువీకరణ పత్రాలు అందించడం నియోజకవర్గానికే గర్వకారణమన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు విశేష స్పందన లభిస్తుందని, ప్రజలు వైఎస్సార్ సీపీకి మళ్ళీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. నియోజకవర్గంలో సుమారు 8 వేల మందికి ఇళ్ళ స్థలాలు మెరక చేసి ఇవ్వాల్సి ఉందన్నారు. వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఇళ్లు నిర్మించుకునేందుకు ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కాని కొంతమంది ఇళ్ల స్థలాలపై తప్పుడు ఆరోపణలు చేస్తుంటే ఎల్లోమీడియా వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు రాతలు రాయడం సరైంది కాదన్నారు. ఎల్లో మీడియా ఎంతగా దిగజారిపోయిందనడానికి నాగులాపల్లిలో జరిగిన కార్యక్రమమే నిదర్శనమన్నారు. ఎండపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కొండా గనిబాబు, భారీ వర్షాల కారణంగా ఇంటి పైకప్పు కూలిపోయిన గొంతు రెడ్డి సుబ్బారావు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, ఉప సర్పంచ్ గుండ్ర శ్రీధర్, సచివాలయ కన్వీనర్ గుండ్ర జగ్గారావు, ఎండపల్లి, కొత్తపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షుడు గుండ్ర రాజబాబు, మారిశెట్టి సత్తిబాబు, జ్యోతుల చక్రబ్బాయి, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ బర్రే రవి తదితరులు పాల్గొన్నారు.



ఎండపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పలువురికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

సురక్షతో సమస్యల పరిష్కారం

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని పెద్దాపురం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల వద్దకు సంక్షేమ పాలన అందించడమే గాక అవసరమైన సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మీమీ సచివాలయాల్లో నిర్వహించే జగనన్న సురక్ష పథకం సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు సర్టిపికెట్లను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ కాంతారావు, పంచాయతీ కార్యదర్శి సుభాని, ఉప సర్పంచ్ శేషారావు, ఎంపీటీసీ బత్తిన రమణమ్మ, పార్టీ నాయకులు కుండల ప్రసాద్, కట్టా పెంటారావు, సుందరరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటి కోసం వెళితే కాటికి..

- నిండు ప్రాణాన్ని బలిగొన్న నిర్లక్ష్యం
- 33 కేవీ విద్యుత్‌లైన్‌ను ఆనుకుని రాయుడుపాలెంలో భవన నిర్మాణం
- సెకండ్ ఫ్లోర్‌లో బైండింగ్ వర్కు చేస్తూ ఐరన్ ఊస తీగలపై పడి మేస్త్రి మృతి



కారుకొండ ప్రసాద్ (ఫైల్)

కాకినాడ రూరల్: పొట్ట కూటి కోసం ఎత్తైన భవన నిర్మాణాలలో ప్రమాదపు అంచున పనిచేసే శ్రామిక జీవులు భవన నిర్మాణ కార్మికులు. వారి జీవితాలను పణంగా పెట్టి పనులు చేస్తున్నా.. భవన యజమానులు సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ఎందరో కార్మికులు ప్రమాదాల పాలవుతున్నారు. ఈ కోవలోనే కాకినాడ రూరల్ రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలెంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. రాయుడుపాలెం నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో నిర్మాణంలో భవనం వద్ద పనిచేస్తున్న సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బైండింగ్ మేస్త్రి కారుకొండ ప్రసాద్(35) 33 కేవీ విద్యుత్ తీగలకు తన చేతిలోని ఐరన్ ఊచ తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రసాద్ తనతో పాటు మరో నలుగురు కార్మికులను తీసుకుని ఉదయమే హుస్సేన్‌పురం నుంచి పనికి వచ్చాడు. రెండో ఫ్లోర్‌లో ఐరన్ ఊచలను కడుతుండగా ప్రసాద్ చేతిలో ఊచ పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు తగలడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలాడు. మొల కింద భాగంలో శరీరం కాలిపోయింది. దీంతో తోటి కూలిలు ఆందోళనకు గురయ్యారు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పీఎంకు తరలించారు. అతనిపై ఆధారపడిన భార్య, ఇద్దరు పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు. పోలీసులు మాత్రం ప్రమాదవశాత్తు జరిగినట్టు కేసు నమోదు చేశారు.



విద్యుదాఘాతంతో అశువులు బాసిన కారుకొండ ప్రసాద్



ప్రమాదం జరిగిన నిర్మాణంలోని భవనం వద్ద ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలు